అనితరుడు
మువ్వా శ్రీనివాసరావు
కవితాంతరంగ విశ్లేషణలు@366
ఆవిష్కరణ

సంపాదకులు
ఖాదర్ మొహియుద్దీన్
సీతారాం
ప్రసేన్
పగిడిపల్లి వెంకటేశ్వర్లు
అనిల్ డ్యాని
12 08.2023 5.00pm
సుందరయ్య విజ్ఞాన కేంద్రం, హైదరాబాద్
నిర్వహణ
తెలంగాణ సాహిత
జాషువా సాహిత్య వేదిక, ఖమ్మం
మువ్వా పద్మావతి రంగయ్య ఫౌండేషన్

నేటి నిజం
# సాహితీ కెరటాలు
website:www.netinijam.com
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 10-8-2023

## ఘంటారావం

మరణించాక
మంచివాడంటావా?
ఉన్నప్పుడంటే
ఉప్పొంగే కదా.

నాలుకను
నియంత్రించకపోతే ఎలా?
ఆరోగ్యం అనుబంధాలకు
అదే దారి కదా..

వదంతులను
వ్యాప్తి చేయకు
విష సంస్కృతికి
ఊతమివ్వకు.

తగవుల్లో
తల్లిదండ్రులు
తప్పుడు పనుల్లో
పిల్లలు


-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

## అమానుషం

ఓ నా పవిత్ర దేశమా..!!
నీకు మరోసారి శిరసా నమామి
మహిళగా ఇక్కడ పుట్టినందుకు
నిసిగ్గుగా నీరాజనాలు
అర్పించుకుంటున్న..

"యత్ర నార్యంతు పూజ్యతే
రమంతే తత్ర దేవతా' అంటారు
ఏదీ..!!?
అదేదీ కానరాదే నా పుణ్య భూమిన
వల్లించేందుకు
అల్లిన కల్లబొల్లి కల్పితాలు..
"బేటీ బచావో",బేటీ పడావో"
ఏది ఎక్కడా..!?
అంతరంగం నుంచి వెలువడని
ఆ పదాల అమలు కనబడదే..!?
యేమో....
"ధృతరాష్ట్ర పాలనలో
ద్రౌపది అవమానం ఎవరికి
విన బడుతుందని".!
అయినా..
నా దేశం పవిత్ర భారత దేశమే
భారతీయులందరూ నాసహోదరులే
నేనే కానిదాన్ని..!

నా కర్మభూమి నడిగడ్డ మీద
సార్వభౌమాధినేత కూడా
ఓ గిరిజన మహిళనే..!
అయినా
మణిపూర్ మారణకాండ
ఎంతకూ చల్లారదు..
చట్టాలూ న్యాయాలూ ఉంటాయి
వాటి రిమోట్ మాత్రం
డిక్టేటర్ల దగ్గరే..!

"వెనకటికెవరో చక్రవర్తి
రోమ్ నగరం తగలబడుతున్నా
ఫిడేల్ వాయించాట్ట"
అలా ఉంది వ్యవహారం
సుమోటోగా రాని న్యాయం
ఎవరికోసమో ఎందుకోసమో
అంతకన్నా..
ఆదిమ జాతుల్లోనే నయం
అప్పటికప్పుడే కన్నుకు కన్నూ
పన్నుకు పన్నూ తీర్పు..

ఏ మూల చూసినా
ఏ రోజు చూసినా
ఏముంది గర్వకారణం
మహిళపై అత్యాచారాల పర్వాలే
పైగా పైకి పొక్కకుండా
ఎప్పటికప్పుడూ వాటిని
కమ్మెయ్యరూ.!?

మణిపురా..
మహారాష్ట్రనా గుజరాతా కాదు
అడుగడుగునా ఆడవాళ్లపై
అఘాయిత్యాలే..!

మహిళలనిక్కడ
వివస్త్రలను చేసి
ఊరేగించి హింసించడం
అనాదిగా వస్తున్న
సనాతన ధర్మం కదా
కళ్ళ ముందటే సామూహిక దాడి
కిమ్మన్న నాధుడు కరువాయే..!

అన్నట్టు..
మీకు తెలియదేమో
ఇక్కడ మహిళలని ప్రతిమలుగా ఉంటేనే
పూజిస్తారు, ఆరాదిస్తారు,అభిషేకిస్తారు
ప్రాణాలతో కంట బడితే,
వెంటాడి వేటాడి వివస్త్రను చేసి
ఉన్మాదులవ్వరూ.!
డెబ్బై ఐదేళ్ల
నా స్వతంత్ర భరతదేశమా..!
నీ మత మదాంధ రాజకీయ
ఎత్తుగడ లలో
మహిళలెప్పటికీ పావులేనా..!!


-నాంపల్లి సుజాత
9848059893



# వాగ్గేయ ఇతిహాసంలో గద్దర్ ఒక శకం



నలుగురిలో కదలాడుతూనే అనూహ్యంగా ఆకాశంలో తారగా మారిపోయిన గద్దర్ ప్రపంచ స్థాయి పీడిత వర్గ పాటగాడిగా కలకాలం నిలుస్తారు. పాల్ రాబ్సన్, బాబ్ డిలాన్ సరసన నిలబడే విశ్వమానవ గీతిక ఆయన. ఉన్నత జీవితాన్నిచ్చే ఇంజనీరింగ్ విద్య , బ్యాంకు ఉద్యోగం తన జీవిత గమ్యాలు కాదని వదిలేసి కష్టాల, తూటాల, కేసుల ముళ్లబాటలో నడవడానికి పాతికేళ్ల వయసులోనే నిర్ణయిం చుకున్న కారణజన్ముడు. గుమ్మడి విఠల్ బాబుగా తూప్రాన్ లో ఇంటి గడప దాటి తొలుత వి బి గద్దర్ గా, ఆ తర్వాత గద్దర్ గా దశాబ్దాల పాటు పీడిత జన గీతాలకు గొంతుకగా, అభిమాను లచే గౌరవంగా ప్రజాయుద్ధ నౌక అని కీర్తింపబడి అర్థాంతరంగా నిష్క్రమించారు.

చదువుకునే రోజుల్లోనే బుర్రకథలు చెబుతూ తన కాలి గజ్జెకి, గొంతు విన్యాసాలకు, హావభావాలకు తర్ఫీదునిచ్చారు. కొన్నాళ్ళకు బి.నర్సింగ రావు స్థాపించిన ఆర్ట్ లవర్స్ తో జత కూడాక గద్దర్ లక్ష్యమే మారిపో యింది. మొదట్లో **'రిక్షా తొక్కే రహీమన్న'** లాంటి గీతాలు హిందీ పాటల బాణీలో కూర్చినా క్రమంగా జానపద పాటల బాటలో విప్లవ గీతాలు రాయడం ఆరంభించారు. ఈ దశలో గద్దర్ ను బి. నర్సింగ రావు ఎంతో తీర్చిదిద్దారు. మనకు కనబడుతున్న గద్దర్ ప్రతిభ వెనుక కనబడని చేయి నర్సింగరావుదే అని సమీప వర్గాలకు తెలుసు. తన తల్లిని దృష్టిలో ఉంచుకొని గద్దర్ రాసిన **'సిరి మల్లె చెట్టు కింద లచ్చుమమ్మో'** ఆయన తొలి పాటల్లో ఒకటి.

ఎమర్జెన్సీ తర్వాతి కాలంలో హైదరాబాద్ కాలేజీల్లో ప్రగతిశీల విద్యార్థి సంఘాల గెలుపుతో జె ఎన్ ఎం పాటల సందడి ఆ ప్రాంగణాలు చేరింది. ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్ లోని కాలేజీలు, హాస్టళ్లు పలవరిస్తే చాలు ఆ సాయంత్రం గద్దర్ గానాబజానా ఉండాల్సిందే. బి హాస్టల్ మధ్య త్రిభుజాకార మైదానం గద్దర్ పద సవ్వడితో మురిసిపోయేది. విద్యార్థి సంఘాలు ఎన్నికలు నిషేధించే దాకా జన నాట్య మండలి విద్యార్థుల వెంటనే సాగింది. ఆ తరవాత విప్లవోద్యమం వ్యాపించిన చోటల్లా గద్దర్ గజ్జె మోగింది. పార్టీ సభల్లో వక్తల ఉపన్యాసాల కన్నా గద్దర్ పాట వినడానికి, ఆయన్ని చూడడానికి వచ్చే వారే ఎక్కువ అనడం అతిశయోక్తి కాదు. గద్దర్ కార్యక్రమం గంటల పాటు సాగేది కాబట్టి ఇతర విప్లవ కవుల పాటలు కూడా పాడేవారు. ప్రధానంగా తన పాటలతో పాటు చెరబండరాజు, వంగపండు, గూడా అంజయ్య పాటలు అధికంగా పాడేవారు. అవంటే ఆయనకెంతో ఇష్టం. చెర 'కొండలు పగలేసినం' లేకుండా కచేరి ఉండేదే కాదు. వంగపండు రాసిన **'యంత్రమెట్లా నడుస్తా ఉందంటే',** గూడ అంజయ్య 'ఊరు మనదిరా' పాటలు ఆయన నోట ఎంతో ప్రచారంలోకి వచ్చాయి.

తొలి రోజుల్లో విప్లవోద్యమ కవు లుగా, రచయితలుగా పేరుపొందిన వారిని కలిసి తాను రాసిన పాటల్ని వినిపించేవారు. అలా ప్రొ.జయధీర్ తిరుమల రావు ఉండే సూర్యనగర్ లో గద్దర్ పాటలు తొలిసారిగా పాడిన సందర్భాలు న్నాయి. 'ఏం కొనేటట్ల లేదు' పాట ఓ ఉదయం తిరుమల రావు ఇంట్లో గద్దర్ పాడినప్పుడు నేను కూడా ఒక శ్రోతని. ఆ తర్వాత సారస్వత పరిషత్ హాలులో జరిగిన కవి సమ్మేళ నంలో గద్దర్ తాను కవికి కాను అంటూనే పాడిన ఆ పాట ప్రతి చరణం చప్పట్లతో మోగిపోయింది. చివరి చరణంలో **'నీ గుడ్డీ దీపమారిపోయే నాగు లో నాగన్న!'** అన్నాక ముందు వరుసలో కూచున్న జ్వాలా ముఖి వచ్చి గద్దర్ ను కౌగలించుకొని కొద్దిసేపటిదాకా వదల్లేదు. పుట్టపర్తి సాయి బాబా పై ఆయన రాసిన పాటను కూడా సభికులను అడిగి మరీ పాడించుకొనేవారు. 1990 ఫిబ్ర వరిలో గద్దర్ నిజాం కాలేజీ గ్రౌండ్స్, హైదరాబాద్ లో నిర్వహించిన భారీ బహిరంగ సభకు రెండు లక్షల మంది రావడం ఓ రికార్డు.

> **"నా పేరు జనం గుండెల చప్పుడు. నా గుండె చప్పుడు ఆగిపోలేదు. కానీ, ఎందుకో గుండెకు గాయమైంది. ఈ గాయానికి చికిత్స కోసం అమీర్ పేటలోని అపోలో ఆస్పత్రిలో చేరాను. జూలై 20 నుంచి పలు చికిత్సలు పొందుతూ కుదుటపడుతున్నాను. పూర్తి ఆరోగ్యంతో కోలుకొని తిరిగి ప్రజా పోరాటంలో అడుగుపెడుతాను."**
> (జులై 31న హాస్పిటల్ నుండి గద్దర్ విడుదల చేసిన లేఖ)

గద్దర్ ఆహార్యం గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. దానికి ఆయనే సృష్టికర్త. భుజాన గొంగడి లాంటి జంబుఖానా, మెడలో ఎర్ర పంచె, మోకాళ్ళ పైకి ధోవతి ఆయన ఎత్తు చిత్తుకు బాగా అమిరాయి. ఆ రోజుల్లో ఆయన బయట కూడా అలాగే ఉండేవారు. 'రంగుల కల' సినిమా ఆఫీసుకు వచ్చిన గద్దర్ ను తొలిసారిగా ప్యాంటు, షర్టులో చూసిందప్పుడే. ఆ యూనిట్ ఉండే స్కూలుకు వచ్చి పాటలు పాడి అందరిని ఉత్సాహ పరిచేవారు. అక్కడ రూపశిల్పి కుమార్, కళా దర్శకుడు వైకుం ఠం, నటుడు బైస దేవదాసు, దర్శక శాఖలో నేను ఇం కొందరు ఉండే వారు.

1980 – 90 దశకాల్లో ఉత్తర తెలం గాణా లో విప్లవ సంఘా ల వ్యాప్తి, వాటికి ప్రజాదరణ ఘనంగా ఉండేది. సింగరేణిలో సికాస హవా నడిచేది. వివిధ సంఘాల సభల్లో జననాట్య మండలి ఆటా పాటా ప్రధాన ఆకర్షణగా జనం పోగయ్యేవారు. వాటి కోసం గద్దర్ కొత్త పాటలు, భిన్న కళారూపాలను సృష్టించారు. భూమిభాగోతం అనే నృత్య రూపకం ఎంతో అలరించేది. దొరను నేను, పట్వారిని నేను, పాలేరును నేను అని స్టేజిపై పాత్రలు నటిస్తూ పాడే బ్యాలే చివర్లో తిరుగుబాటు సీను చప్పట్లతో మారుమోగేది. అలాగే ఆదిలాబాద్ గిరిజనుల కోసం గోండు పదాలతో రూపొందించిన రగల్ జెండా కూడా గద్దర్ మానస పుత్రికనే. 'అడవి తల్లికి దండాలు' అంటూ మొదలయ్యే ఈ నృత్యరూపకం సుమారు గంట పాటు ఉంటుంది.

గద్దర్ మాభూమి లో నటించి, పాడడానికి కారణం అది నర్సింగరావు నిర్మించిన ప్రజల సినిమా కావ డమే.అదే రకంగా నర్సింగరావు మరో సినిమా రంగుల కల లో 'భద్రం కొడుకో' పాటలో నటించారు. ఆ తర్వాత ఎన్నో ఏళ్లకు ఒరేయ్ రిక్షా కోసం పాటలు రాశారు. ఆ సినిమాకు రాసిన 'మల్లెతీగకు పందిరివోలె' పాట ఎంతో ప్రజాదరణ పొందింది. 'నీ పాదం మీద పుట్టుమచ్చనై చెల్లెమ్మా' అనే పాదాలు జనం గుండెల్లో నిలబడిపోయాయి. తెలంగాణ రాష్ట్ర పోరులో భాగంగా ఎన్. శంకర్ తీసిన సినిమాలో 'పొడుస్తున్న పొద్దు మీద' పాట ఉద్యమానికే ఊపిరి అయింది. **'అమ్మా తెలంగాణమా! ఆకలి కేకల గానమా!'** అనే పాటలో తెలంగాణ బాధల్ని కళ్ల ముందుంచారు.

గద్దర్ కు సమాజ మార్పుపై స్పష్టమైన, శాస్త్రీయ అవగాహన ఉంది. ఇంటర్వ్యూలలో ఆయన ఇచ్చే సమాధానాలు ఆయన అంతరంగాన్ని, అసంతృప్తిని ప్రతిబింబించేవి. అడుగులు పార్లమెంట్ పంథా వైపు పడినా గుండెలో మాత్రం మార్క్సిస్టు, అంబేద్కర్ భావజాలం రగులుతూనే ఉండేది. గద్దర్ ఆ జెండాల కిందనే బతికారు. ఇప్పటికీ వార్తల్లో, ఛానళ్లలో జనంతో కలిసి నడుస్తున్న గద్దర్ హాస్పిటల్ లో చేరి ఆ సంగతి ఓ లేఖ ద్వారా ప్రజలకు తెలియజేశారు. ఆసుపత్రిలో ఆయనను కలిసినవారితో బాగానే మాట్లాడారు. అకస్మాత్తుగా ఆరవ తేదీన మధ్యాహ్నం పిడుగులా ఆయన మరణ వార్త భళ్లుమంది. ఔనా నిజమా అని అనుమానం లోంచి జనం క్రమంగా దుఃఖసా గరమైపోయారు.

'నా పేరు జనం గుండెల చప్పు డు. నా గుండె చప్పుడు ఆగిపోలేదు. కానీ, ఎందుకో గుండెకు గాయమైంది. ఈ గాయానికి చికిత్స కోసం అమీర్ పేటలోని అపోలో ఆస్పత్రిలో చేరాను. జూలై 20 నుంచి పలు చికిత్సలు పొందుతూ కుదుట పడుతున్నాను. పూర్తి ఆరోగ్యంతో కోలుకొని తిరిగి ప్రజా పోరాటంలో అడుగుపె డుతాను.' అని గద్దర్ హాస్పిటల్ నుండి జూలై 31 న విడుదల చేసిన లేఖ తీరని కోరికగా మిగిలింది.

చడీ చప్పుడు లేని గద్దర్ మరణం ఆయన చరితను సగమే మనకు మిగిల్చింది. ఆయన్ని రాతగాళ్ళు కలిసి సేకరించే ఎన్నో సంగతులు, స్వయంగా గద్దర్ తన జీవననుభవాలను పూర్తిగా మనకు చెప్పే అవకాశం జారిపోయింది. గద్దర్ కాలు లయ తప్పుతోందని అనుకున్నారు కానీ లయ తప్పుతున్న గుండె నిశ్శబ్దంగా ఆయన్ని తీసికె ళ్లింది. గద్దర్ అంతిమ యాత్రలో జన సమూహం, అక్షరాలతో రచయితల నీరాజనం ఆయన బతుకు అజరామరం అని చాటుతున్నాయి. గద్దర్ ఒక లెజెండ్, గద్దర్ ఒక హిస్టరీ.ఆయన గానాన్ని, జ్ఞాపకాల్ని ముందు తరాల కోసం భద్రపరచడం పీడితవర్గాల చారిత్రక అవసరం.


– బి.నర్సన్
9440128169



## అమృత్ మహోత్సవ్

ఇది మారాల్సిన తరుణం.
జెండా వందనంతోనే జాతి కీర్తి
పెరగదని ఆలోచించి
మనం బాధ్యతలతో
కరచాలనం చేయాల్సిన సమయం.

దాస్య శృంఖలాల నుండి విముక్తి
పొంది స్వాతంత్రం కోసం
రక్తతర్పణం చేసిన వీరుల త్యాగాలకు
ప్రతిఫలంగా వారు కలలు
కన్న భారతావనికై పాటుపడదాం.

ఉద్యోగాల వేటలో అసహనానికిలోనై
భవిష్యత్తును
అంధకారం చేసుకోకుండా,
జీవనోపాధికై
అవకాశాలను సృష్టించుకునే
సమర్థులైన యువతను తీర్చిదిద్దుదాం.

నైతిక విలువలను వదిలి పెట్టి,
పెడత్రోవ పట్టిన
రేపటి పౌరుల ఆలోచనా
తీరును మార్చి జాతి రత్నాలుగా
తయారుచేద్దాం.

శారీరక ,మానసిక దాడులతో
మగువ నిత్యం వేధించబడుతూ,
పురుషాధిక్యత కోరల్లో చిక్కుకోకుండా,
నర నరాల్లో కూరుకుపోయిన
లింగ వివక్షతను
అంత్యక్రియలు చేసి
సమానత్వపు ఊపిరి పోద్దాం.

నువ్వు , నేను అనే
స్వార్థపు కుట్లు తెంపి
మనమనే నిస్వార్థ
పతాకాల్ల విహరిస్తూ
భేష జాలాల ప్రకంపనలు
మన మనసులను కదిలించకుండా
ఐక్యతా మేకులు
మన హృదయాల్లో దింపుదాం.

వయసు ద్వారా అందుకున్న
అనుభవాలను గౌరవిస్తూ,
కనుమరుగవుతున్న విలువలను
వెతికి పట్టుకొని మానవత్వపు
చిరునామా అందిద్దాం .

అందరికీ అన్నం పెట్టే
రైతన్నకు పట్టెడన్నం
దొరకక ఆత్మహత్యలు చేసుకునే
దుస్థితి నుండి కాపాడేందుకు
మన మేధస్సును వాడి
ప్రణాళికలు రచిద్దాం.

దేశాభివృద్ధికి దోహదపడే
విలువైన ఓటును
నోటుకు అమ్ముడుపోకుండా
కష్టార్జితం అనే
సంపదను మాత్రమే అందుకుంటూ
స్వచ్ఛమైన రాజకీయాలకు
పట్టం కడదాం.

కాశ్మీరు నుండి కన్యాకుమారి దాకా
కునుకైనా తీయకుండా పహారాకాసే
వీర
సైనికులను మన ఇంటి నుంచే
తర్ఫీదు నిస్తూ శత్రువులకు శ్వాసైనా
పీల్చకుండా ఉక్కిరిబిక్కిరి చేసే
యుద్ధ తంత్రాలను నేర్పే ఆశయాలకు
పురుడు పోద్దాం.

సామాజిక ఆర్థిక రాజకీయ దోపిడీ
అనే వ్యసనాలు లేని భారతావనిని
అందుకోవడానికి
ఓ అడుగు ముందుకు వేద్దాం.

ఆజాదీక అమృత్ మహోత్సవం
సందర్భంగా త్యాగధనుల స్ఫూర్తితో
ఎదలోతుల్లో ఘుప్పుమంటున్న
దేశభక్తి పరిమళాలను ఆస్వాదిద్దాం.

మేరా భారత్ మహాన్ అంటూ,
భారతమాత గర్వపడేలా, నింగిసైతం
తలదించి జైకొట్టేలా మువ్వన్నెల
జెండా పరపతిని పెంచుదాం.


-షేక్.నసీమా బేగం
9490440865

## నీవు సల్లగుండాలె

**(వచన కథా కావ్యం-28)**



పోలీస్ పటేల్
మాలీ పటేల్
కరణం పటేల్
మొన్నటి వరకు
ఈ దొరల, పటేండ్ల ఉక్కు పిడికిలిలో
సామాన్యుని బొక్కలు( ఎముకలు) పటపటలాడినై
మరి నిన్న...
రాజన్న, గంగన్న, శివన్న...
అజ్ఞాతంలోని అన్నల గన్ను మోతతో
పెత్తందారులకు మొత్తం తడిసిపోయింది
ఇప్పుడు...
చరిత్ర నేర్పిన పాఠాలతోని
నాయకత్వం మాయలు చేయడం నేర్చుకున్నది
ఎప్పుడైనా బలి పశువయ్యేది
అమాయకుడే!
మధ్యతరగతి అమాయకత్వం, అజ్ఞానం, ఆశ...
నాయకత్వానికి ఆసరా...!
దీన్ని సమయోచితంగా సమన్వయ పరచడం
సామాన్యమైన విషయం కాదు
తిరుగుబాటు మొండి ధైర్యం
చైతన్య వృక్షానికి పాదులు చేస్తుంది కానీ,
దానికి నీరు పోసేది తెలివి...
'వినదగునెవ్వరు చెప్పిన '
అనుకుంటనే
అందులోని నిజా నిజాలు కనిపెట్టి
తగిన రీతి పావులు కదపడం
అలవర్చుకున్నది సరయూ...
అందులో భాగంగానే
సంఘాలను బలంగా తయారు చేసింది
రైతు సంఘం, కుల సంఘం,
పొదుపు సంఘం, యూత్ సంఘం
అన్నింటికీ మించి... మహిళా సంఘం
దానికి అధ్యక్షురాలు అపర్ణ!
అన్ని కార్యకలాపాలు ఓపెన్
ఎక్కడా దేనికీ దడిగట్టలేదు!
ఎవనికీ చెవులు కొరుక్కునే చాన్స్ లేదు!!
అందులో భాగంగానే
మర్యాదపూర్వకంగా పెద్దమనుషులను,
అధికారులను,
బ్యాంకు, న్యాయవ్యవస్థ, రక్షణ రంగం...
ఆ ఊరిని పరిచయం
చేసుకునేలా చేసింది
ఊళ్లో పార్టీల చూర్లకు వేలాడుతున్నోళ్ళు
మేం నాయకులమన్న భ్రమలో తేలుతున్నోళ్ళు
కుడితిలో ఎలుకలైనారు!
మగవాడైనా, పగవాడైనా
సెగ జూపేటోడైనా మృగ లక్షణాలోడైనా
తప్పనిసరిగా
'ఆమె సల్లగుండాలె ' అని పలికే
నిస్సహాయ స్థితి కల్పించింది.


-దోరవేటి
సెల్:9866251679

## సునందామృతం

### కేతకీ కుసుమ న్యాయము

కేతకీ అంటే మొగిలి చెట్టు. కుసుమము అంటే పువ్వు. కేతకీ కుసుమము అంటే మొగిలి పువ్వు.

మొగిలి పువ్వు చక్కని సువాసన కలిగి ఉంటుంది. చాలా రోజుల వరకు ఆ పరిమళం తగ్గదు. కానీ దానికి నిండా ముండ్లే వుంటాయి. వాటి పరిసరాల్లో నాగుపాములు ఎక్కువగా తిరుగుతూ ఉంటాయంటారు.

ఆ ముండ్లు, ఈ పాముల కారణం చేత ఎవరూ సాహసం చేసి ఆ పువ్వులను కోయరు. అదెంత పరిమళ భరితమైనా పూజలకు ఉపయోగించరు. అందుకే ఈ న్యాయము వాడుకలోకి వచ్చింది.

అలాగే ఈ పద్యాన్ని చూద్దాం. "విద్యచే భూషితుండై వెలయు చున్న/ దొడరి వర్జింప నగు జుమీ దుర్జన ఉండు/ చారు మాణిక్య భూషిత శస్త మస్త/కంబుగల పన్నగము భయంకరము గాదె!"

దుర్జనుడైన వాడు యెంత విద్వాంసుడు అయినా సరే అతడికి దూరంగానే ఉండాలి. ఉంచాలి కూడా. తలపై మణితో ప్రకాశిస్తూ ఉన్నా పాముకు భయపడి దూరంగానే ఉంటాం కదా!

దుర్జనుడైన వ్యక్తిలో ఎంత ప్రతిభా పాటవాలు ఉన్నా . అతని వల్ల జరిగేది హానినే. కాబట్టి దూరంగా ఉండాలి.

మొగిలి పువ్వు కూడా అంతే. ఎంత పరిమళభరితమైనా దానిని పొందాలంటే గాయపడాల్సి వస్తుంది. కాబట్టి దాని దగ్గరకు వెళ్ళే ప్రయత్నం చేయకపోవడమే మంచిది.

ఇలా ఈ పద్యాన్ని కూడా కేతకీ కుసుమ న్యాయమునకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

అలాగే లోభి వాడి దగ్గర ధనం ఎంత ఉన్నా ఏం లాభం. ?అద్దంలో చందమామలా ఆశ పడేలా చేస్తుంది తప్ప,ఎవరికీ ఉపయోగ పడదు.

ఎదురుగా కనబడుతున్నా అనుభవింప శక్యం కాని, ఉపయోగించుకోలేని వాటిని గురించీ, ఇవ్వాల్సినవి ఎన్నున్నా కఠినాత్ములు, లోభుల వల్ల ఇతరులకు ఎలాంటి ప్రయోజనం ఉండని సందర్భాలలో ఈ కేతకీ కుసుమ న్యాయమును ఉదాహరణగా చెబుతుంటారు.


-పురిమళ్ల సునంద
9441815722

## ప్రియ భారత దేశమా నీకు వందనం...!!

పల్లవి:
ఓ.. ప్రియమైన భారత దేశమా
సర్వజనుల సుఖానుభావమా..
అంబరాన ఎగిరింది సంబరాల త్రివర్ణం
భారతమాత సిగలో విరబూసిన పుష్పం
సువాసనల మారాలి భారతం
భరతమాత మురిసేలా బ్రతకాలి అందరం
కలిసుందాం మనమందరం... ॥ఓ॥
చరణం:
కనుపాపలా కాపాడువారు బార్డర్ సిపాయి
తమ కళ్ళే క్రొవొత్తులై కరిగిపోవు నోయి
అమ్మానాన్న భార్య బిడ్డలను వీడి..
జన్మభూమికై పోరులో సాగినారుగా
స్వరాజ్యం చేతికి వచ్చే స్వేచ్ఛగా జీవించుటకు
స్వాంత్ర్యం సొత్తుగా వచ్చే
రాజ్యాధికారం చేయుటకు ॥ఓ॥
చరణం:
ఉదయించే సూరీడు నీతి అవనీతులపై
మేఘాలే వర్షిస్తుంది మంచి చెడ్డలపైన
నింగినేల నీరు నిప్పు గాలి..
ఈ పంచభూతాలకు లేదుగా
ప్రకృతిని ఆస్వాదించి మనిషిని ద్వేషించకుమా
మనుషులంతా ఒక్కటేనని
మానవత్వం మరువకుమా ॥ఓ॥
చరణం:
భారతబాత బిడ్డలుగా జన్మఋణం తీర్చు
సహోదర ప్రేమతో బ్రతుకును శ్లాఘించు
కులమత ధనిక పేద ప్రాణం..
ఈ మువ్వన్నెల నీడలో జీవించగా
కులం నీకు కూడు పెట్టదు గూడు చెదిరి పోయినా
మతం నీకు మార్గం చూపదు
మంచి మనిసి కాకపోయినా ॥ఓ॥

– మూడ్ నాగేశ్వరరావు
సెల్: 9347298365

# చిరు కవితా చంద్రికలు నిర్మల హృదయ ప్రకంపనలు

పుస్తక సమీక్షలు





ఎనిమిది పదుల వయస్సులో వల్లభుని నిర్మల ప్రసాద్ (నిర్మల్) వెలువరిస్తున్న అయిదవ కవితా సంపుటి **"చిరు కవితా చంద్రికలు".** యిదివరలో ప్రకటించిన నాలుగు సంపుటాలపై నేను సమీక్షా వ్యాసాలు రాసినట్టు గుర్తు. .నిర్మల్ విద్యుత్ శాఖలో ఉన్నతోద్యోగిగా పదవి విరమణ చేశారు. వారి తండ్రి వల్లభుని నాగేశ్వరరావు ఛందోబద్ధ కవిత్వం రాసి **'అపర వేమన'**గా ప్రసిద్ధులు. ఆ వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న నిర్మల్ 103 లఘు కవితలతో సమాజంపై ప్రసరింపజేసిన చంద్రికలు యివి. చంద్రిక అంటే వెన్నెల వెలుగు. మానసిక వికాసాన్ని కాంక్షిస్తు వ్యక్తిత్వ నిర్మాణానికి తోడ్పడే ప్రబోధాత్మక గుళికలు.

సంసారం సజావుగా సాగిపోవాలంటే భార్యాభర్తలు ఎలా వుండాలి?

**"జోడెద్దులు సమముగానె
కూడి నడిస్తేనే వ్యవసాయం-
ఆలుమగలు కలిసి మెలసి
సాగితేనె సంసారం"** అంటున్నారు వల్లభుని. ఈయన స్త్రీ పక్షపాతి. పురుషాంకార వ్యతిరేకి.

**"మగవారల జులుము చూడ
మగువలకొక పెద్దపీడ
ఇంటిలోని యిల్లాలే
ఇంటలేక పోయినచో
కనిపించును మగవారల
కన్నులకును నరకమపుడు"**

అహంకారులైన మగవారల దాష్టికాలను ఎండకడుతు చాలా కవితలు రాశారు. ఈయన సతీమణి సత్యమణి అదృష్టవంతురాలు కదూ!

**"పంట పొలములోన, నడుమును
వంచుతూ వరినాట్లువేసే
పల్లె పడతుల ఒంపుసొంపులు
ఇంపు గొలుపును కనులకు-"**

వంటి చిలిపి కవితల్ని కూడా ఆస్వాదించవచ్చు.

ఎవరో పిరికి పందల కామం కాటుకి బలయిన అనాథపిల్లలు సమాజంలో చాలా మందే వున్నారు. వారిని చేరదీసి ఆదరిస్తే, కమ్మటి స్పర్శను అందిస్తే గొప్ప మేధావులుగా తయారవుతారు.

**"వాడిపోయే చిన్ని మొక్కకు
పాదుచేసి నీరు పోస్తే
మహా వృక్షముగా పెరుగును
మానవాళికి నీడనొసగును"** ఈ దిశగా సమాజం ఆలోచించాల్సిన ఆవశ్యకత ఎంతగానో వుంది.

పల్లెలు మాయమై పట్టణాల్లో కలిసిపోతున్న తరుణంలో

**"పట్టణం పడుచుపిల్లలా
ప్రజల్ని ఆకర్షిస్తుంది
పల్లెసీమ కన్నతల్లిలా
చల్లగా కాపాడుతుంది"** అంటున్నాడు ఈ కవి.

**'లంచాలు యెరవేయుచుంటారు
అవినీతి బీజాలు నాటుచుంటారు"** అంటు లంచాలను యిచ్చేవాళ్ళని తప్పు పడ్తున్నారు నిర్మల్. యిచ్చేవాడు లేకపోతే పుచ్చుకునేవాడు వుండడని కవి భావన. అవినీతిరహిత వ్యవస్థను కోరుకుంటున్నాడు.

**"దేశమందున భాషలందున
తెలుగు భాషే సుందరం
తెలుగు భాష దీప్తి కోసం
పాటుపడదాం అందరం"** అన్న ముక్తాయింపు పంక్తులతో తన మాతృభాషాభిమానాన్ని చాటుకుంటున్నారు వల్లభుని నిర్మల ప్రసాద్.

కొంత ప్రబోధం, కొంత వినోదం, మరికొంత విజ్ఞానం, కలగలిపి సృజించిన చిరుకవితా చంద్రికలు యివి.

**"రాలిన కుసుమాల కొరకు
పూలచెట్టు బాధ పడదు
కొత్తపూలు పూయించగ
నిత్య ప్రయత్నము చేయును"**

అంటు వ్యక్తిత్వ నిర్మాణానికి వేసిన బంగరు బాట యిది. ఈ కవితా కుసుమాలను ఆఘ్రాణించండి. అనుభూతి పరిమళాలను ఆస్వాదించండి.

**ప్రతులకు:** వల్లభుని నిర్మల ప్రసాద్, డో.నెం. 82-7-6/7, ఫ్లాట్ నెం.ఎస్2, చక్రవర్తి శ్రీ నిలయం అపార్టుమెంట్, స్ట్రీట్ నెం.3, విద్యుత్ కాలనీ ఎ.వి.అప్పారావు రోడ్, రాజమహేంద్రవరం-533106
సెల్: 9515437012.


– రమణ వెలమకన్ని
సెల్: 9866015040

# అన్నాడి గజేందర్ రెడ్డి- వెలుగుల వెల్లువ





గేయం, వచన కవిత, కథా ప్రక్రియలలో రాణిస్తున్న 'అన్నాడి గజేందర్ రెడ్డి', కొన్ని పుస్తకాలను చదివి, సమీక్షాత్మకంగా ఆ వ్యాసాలను వెలుగుల వెల్లువ సంపుటిగా ప్రచురింపచేసారు. వెలుగు దర్వాజా, నవతెలంగాణ, సాహితీకిరణం, నేటినిజం పత్రికలలో ప్రచురింపబడిన కవిత్వ వ్యాసాలలో నందిని సిధారెడ్డి, ఏనుగు నరసింహారెడ్డి, ఉదయశ్రీ, మార విజయలక్ష్మి, సరసిజ, ఎర్రోజు వెంకటేశ్వర్లు వంటి వచన కవుల కవిత్వం చదివి 38 వ్యాసాలుగా వెలుగుల వరుస, సంపుటీకరించారు. నేటినిజం ఎడిటర్ బైస దేవదాస్ సారధ్యంలోని 'మట్టి మనిషి ధిక్కార స్వరం', అన్నవరం దేవేందర్ నవాబు లోని తెలంగాణ సోయి, కథాశతక పద్యం, శతకాలు, కవితలు, హైకూలు, నానీలు వైవిధ్యభరితమైన వ్యాసాలుగా ఈ సంపుటిలో చోటు చేసుకొన్నాయి. వెలుగుల వెల్లువలో, అంతగా చదువరులకు పరిచయం కాని కొత్తకవులకు, యిప్పుడిప్పుడే వెలుగులోకి వస్తున్న యువకవులకు ప్రోత్సాహం కల్పించడం విశేషాంశం. తెలంగాణ భాషకు, యాసకు, పల్లెలలోని అనుబంధాలకు, భావాల ఆత్మీయతలకు పట్టం కట్టిన డా॥ దాశరథుల నర్సయ్య రాసిన 'బోనం బువ్వ' వంటి వ్యాసాలలో వంటకాలు, పండుగలు, ఆలయాలు, ఆచార్య వ్యవహారాలు, సాహితీ, సంస్కృతులు, కళలు తెలంగాణ సీమ ఔన్నత్యాన్ని దర్శింపచేస్తున్నాయి. మామిడి హరికృష్ణ, జింబో, ఎర్రోజు, గాజోజు, నర్సయ్య, కూకట్ల తిరుపతి, కందుకూరి శ్రీరాములు రాసిన కవితా సంపుటిలను లక్ష్య ప్రాయమైన సమీక్షలతో, తెలం గాణ అస్తిత్వ ప్రేమికుడైన గజేందర్ రెడ్డి, తెలంగాణ కట్టుకం రాళ్లను పేర్చి వెలుగుల వెల్లువ కవిత్వ వ్యాసాలు ప్రచురింపచేసారు. డా॥ నందిని, డా॥ ఏనుగు నరసింహారెడ్డి, డా॥ నలిమెల భాస్కర్, సాహిత్యంలో తనకు మార్గదర్శకులని 'నూరుపూలు', 'కవిత్వం', 'సుద్దముక్క' వంటి రచనలలో వర్ధమాన కవులకు అనుసరణీయమైన అంశాలను వివరించారు. 40 వసంతాలుపైగా సాహిత్యంతో వివిధ ప్రక్రియలలో బాధవ్యం కలిగిన అన్నాడి గజేందర్ రెడ్డి, సిద్ధహస్తులైన తెలంగాణ రచయితలు, కవుల రచనలకు లోతైన విశ్లేషణలతో 'వెలుగుల వెల్లువ' ప్రచురించడం అభినందనీయం.

**ప్రతులకు:** అన్నాడి గజేందర్ రెడ్డి
ఇ.నెం. 8-3-129,
భగత్‌నగర్,కరీంనగర్-505001
సెల్:98488 94086


-జయసూర్య
సెల్:9014948336
9394775088

# పద్యామృతాన్ని బ్రోలిన 'పద్యామృత వర్షిణి' గ్రంథం-డా॥కె.వి.రమణాచారి

సహస్ర పద్య కంఠీరవ చిక్కా రామదాసు కలం నుండి జాలువారిన "పద్యామృత వర్షిణి" గ్రంథం పాఠకులకు పద్యామృతాన్ని బ్రోలిందని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా॥ కె.వి.రమణాచారి కొనియాడారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలుగు సాహిత్య కళాపీఠం ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో సహస్ర పద్యకంఠీరవ చిక్కా రామదాసు, సక్కుబాయి అమృతోత్సవ వేడుకలు, ఆయన రచించిన పద్యామృత వర్షిణి గ్రంథావిష్కరణ-అంకితోత్సవాలు వైభవోపేతంగా జరిగాయి. ప్రముఖ కవి డా॥ ఈటెల సమ్మన్న సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా॥కె.వి.రమణాచారి మాట్లాడుతూ 'తెలుగు సాహిత్య కళాపీఠం' ఏర్పాటు చేసి ఎన్నో సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తూ ఎంతో మందిని ప్రోత్సహిస్తున్న చిక్కా రామదాసును అభినందించారు.

ఆయన అమృతోత్సవం సందర్భంగా పద్యామృత వర్షిణి గ్రంథాన్ని రచించి ఆవిష్కరింపజేయడం, ఆ గ్రంథాన్ని డా॥ ఎల్లంపల్లి బుచ్చిరెడ్డి, శ్రీమతి కౌసల్య దంపతులకు అంకితం ఇవ్వడం ఒక ఎత్తైతే, కవి, సినీ గేయ రచయిత మౌనశ్రీ మల్లిక్, అష్టావధానిం బండికాడి అంజయ్యగౌడ్, సాహితీవేత్త శ్రీమతి శైలజామిత్ర, తంగెళ్లపల్లి కనకాచారి, కవి తిరుమల వెంకటస్వామిలను విశిష్ట నగదు పుస్కారంతో సత్కరించడం ముదావహంగా వుందని అన్నారు. విశిష్ట అతిథులుగా డా॥ అనంతలక్ష్మి, బైస దేవదాసు, డా॥ అక్కిరాజు సుందర రామకృష్ణ, మద్ది దివాకర్‌రెడ్డి, దోరవేటి చెన్నయ్య, కె. నరసింహగౌడ్, ధనంజయగౌడ్‌లు చిక్కా రామదాసు రచించిన పద్యామృత వర్షిణి గ్రంథాన్ని ఆయన వ్యక్తిత్వం గురించి కొనియాడుతు అభినందించారు. రచయిత చిక్కా రామదాసు డా॥ ఎంపల్లి బుచ్చిరెడ్డి-కౌసల్య దంపతు లకు గ్రంథాన్ని అంకితం ఇచ్చి ఘనంగా సత్కరించారు.

విశిష్ట పురస్కార గ్రహీతలను ముఖ్య అతిథి ఘనంగా సత్కరించారు. ధార్మిక వరేణ్య కురిమిళ్ళ నరసింహగౌడ్ చిక్కా రామదాసుకు స్వర్ణాంగులీయం బహూకరించారు. చిక్కాశంకర్ అభినందన పద్యంతో అలరించగా, పేరడి గురుస్వామి పేరడీల గారడీ రివర్స్‌గేర్లో పాటలుపాడి అందర్నీ ఆకట్టుకున్నారు. మిమిక్రీ కళాకారుడు మల్లం రమేశ్ వినోద ప్రదర్శన, బైరి రామయ్యతో పాటు ప్రసిద్ధ గాయనీ గాయకులచే సుస్వర సుమధుర రాగరంజిత గానామృతలహరి ద్విగ్విజయంగా జరిగింది. చిక్కా దేవదాసు, సి.హెచ్.రవికిరణ్‌లు అతిథులను సత్కరించారు. తన అమృతోత్సవ సభకు వచ్చి ఆశీర్వదించి ఆనందపరిచినందులకు, 'తెలుగు సాహిత్య కళాపీఠం' కార్యక్రమాలకు అన్ని విధాల సహకరిస్తున్న వారందరికి చిక్కా రామదాసు కృతజ్ఞతలు తెలిపారు.



గ్రంథావిష్కరణలో చిక్కా దేవదాసు, చిక్కా శంకర్, మద్ది దివాకర్‌రెడ్డి, డా॥ అక్కిరాజు సుందరరామకృష్ణ, బైస దేవదాసు, ఆవిష్కర్త డా॥కె.వి. రమణాచారి, డా॥ ఈటెల సమ్మన్న, చిక్కా రామదాసు, బద్దం ధనుంజయగౌడ్, డా॥ అనంతలక్ష్మి, దోరవేటి, కురిమిళ్ళ నరసింహాగౌడ్, బాలరాజుగౌడ్, సి.హెచ్. రవికిరణ్ తదితరులు.



చిక్కా రామదాసు-సక్కుబాయి దంపతులను సత్కరిస్తున్న డా॥కె.వి.రమణాచారి తదితరులు.



కృతి స్వీకర్తలు డా॥ఎంపల్లి బుచ్చిరెడ్డి-శ్రీమతి కౌసల్య దంపతులు



విశిష్ట పురస్కార గ్రహీతలు మౌనశ్రీ మల్లిక్, శ్రీమతి శైలజామిత్ర, కనకాచారి, తిరుమల వెంకటస్వామి, బండికాడి అంజయ్యగౌడ్.



చిక్కా రామదాసుకు స్వర్ణాంగులీయం బహూకరిస్తున్న కురిమిళ్ళ నరసింహాగౌడ్.

## ప్రజలను హింసించిన చరిత్ర.. ఆ రెండు పార్టీలదే : మంత్రి జగదీష్ రెడ్డి

హైదరాబాద్, ఆగష్టు 9: పిండాలు పెట్టి ప్రజలను హింసించిన చరిత్ర కాంగ్రెస్, టీడీపీలదే.. దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ అదే పని చేస్తున్నదని, రేవంత్ రెడ్డి ప్రజలకు పిండాలు పెట్టిన టీడీపీ, కాంగ్రెస్‌లకు చెందిన వాడు కనుకే పిండాల గురించి మాట్లాడుతున్నారని మంత్రి జగదీష్ రెడ్డి ఫైర్ అయ్యారు.

బుధవారం బీఆర్ఎస్ ఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాటాడారు. కేసీఆర్‌కు పిండం, తద్దినం పెట్టడం గురించి పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నాడు. కేసీఆర్‌కు ఎందుకు పిండం పెడుతావ్.. పేదల బతుకుల్లో వెలుగులు నింపుతున్నందుకా..ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టినందుకు కేసీఆర్‌కు పిండం పెడతావా..తన ప్రాణాలు అడ్డం పెట్టి తెలంగాణకు ప్రాణం పోసినందుకు కేసీఆర్ కు పిండంపెట్టాలనుకుంటున్నావా అని సూటిగా ప్రశ్నించారు.

సంస్కారం లేని పార్టీకి రేవంత్ అధ్యక్షుడు రేవంత్ పిండం పెట్టాలనుకుంటున్నది కేసీఆర్‌కు కాదు.. తెలంగాణకు అని మండిపడ్డారు. రేవంత్ ఇంకాతెలంగాణ ద్రోహుల చేతుల్లో ఉన్నారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉండి ఇలాంటి చిల్లర మాటలు మాట్లాడటం సిగ్గుచేటన్నారు. దివంగత మాజీ ప్రధాని, తెలంగాణ బిడ్డ పీవీకి సరైన అంత్యక్రియలు నిర్వహించని సంస్కారం లేని పార్టీకి రేవంత్ అధ్యక్షుడని ఘాటుగా విమర్శించారు. రేవంత్ మాట్లాడే భాషను కనీసం వాళ్ల ఇంట్లో నైనాఒప్పుకుంటారా? 50 లక్షల లంచం డబ్బుతో దొరికి టీడీపీకి తద్దినం పెట్టినవ్. కరెంటుతో పిచ్చి వ్యాఖ్యలు చేసి కాంగ్రెస్ కు తద్దినం పెట్టినవని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ గనుక రాజకీయ కక్ష ప్రదర్శిస్తే రేవంత్ వాడుతున్న భాషకు రోడ్ల మీద తిరుగలేవన్నారు.రేపటి రోజుల్లో ప్రజల చేతిలో రేవంత్ కు భంగపాటు తప్పదని హెచ్చరించారు. మాది కల్యాణ లక్ష్మి, కేసీఆర్ కిట్, రైతుబంధు భాష, మీది పిండాల భాష. ప్రజలను చంపడం సంపాదించుకొవడమే మీకు అలవాటని మండిపడ్డారు.సీఎం కేసీఆర్‌కు, తెలంగాణ సమాజానికి రేవంత్ క్షమాపణ చెబితే మంచిది. క్షమాపణ చెప్పకపోతే ఏం చేయాలో తెలంగాణ సమాజానికి తెలుసునని అన్నారు. జగన్‌కే కాదు చంద్రబాబుకు కూడా ప్రగతి భవన్‌లో ఆతిథ్యం ఇచ్చామన్నారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 908వ రోజు 'ప్రజాయుద్ధ నౌక' అనే అంశంపై పలువురుకవులు తమ కవితలను పంచుకున్నారు. 'ప్రజాయుద్ధ నౌక' అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా... సంపాదకులు...



మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం
ఏకాంశ కవిత్వం నిర్వహణ:
-డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు, 9441046839

### తుఫాన్ సృష్టించిన గద్దర్

తీరం చేరిన
ప్రజాయుద్ధనౌక
తూఫ్రాన్ లో పుట్టాడు
తుఫాన్ రేపాడు
ఉద్యమానికి ఊపు
ప్రజలకు వెన్నుదన్ను
కాళ్లకు గజ్జెకట్టి
భుజాన గొంగళి వేసి
గంతులు వేసి
దరువులు వేసి
ప్రజల పాట్లు తెలిసి
పాటకు ప్రాణం పోసి
జనం మదిలో నిలిచిన ధీరుడు!!.
ఆగని గోస
దగాను ఎండగట్టి
సామాన్య జనానికి అండగా నిలిచి
చెల్లి కాలికి పుట్టుమచ్చయి
తెలంగాణకు పొద్దు పొడుపై
తెలంగాణ తల్లికి ముద్దు బిడ్డయి
అందరి మదిలో కొలువై
పాటకు శాశ్వత్వాన్ని
కలిగించిన గద్దర్
డప్పు డోలు కొట్టి
అందరూ మెచ్చిన
అందరూ నచ్చిన
ప్రజాగాయకుడు
ఆగస్టు లో
అసువులు బాశాడు
ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్నాడు.

-డా.చీదెళ్ళ సీతాలక్ష్మి

### అమరుడు

ఎగసి కట్టిన గోచి
ఎగదోసే గొంగళి
ఒడిసి పట్టిన ఎర్ర జెండా
బిగిసి కట్టిన కాలి గజ్జ
ఊపు నిచ్చే
గద్దరన్న ఆహార్యం
ప్రజా యుద్ధ నౌక సంచారం
పదాల వంటకం కాదు
అతని పాట
దోపిడీ పై దూసుకెళ్లిన
తూటా !.
అణగారిన వర్గం వైపు నిలచిన
అతని పాట
దుష్ట పాలకుల పాలిటి
సింహ స్వప్నం !
సమసమాజం కోసం
పాడిన ఆ పాట
న్యాయం కోసం పూరించిన
శంఖారావం !.
చాలించినా దేహం
స్ఫూర్తిదాయకం ఆ జీవితం
మనందరికీ ఆదర్శం
ఆ విప్లవ గళం అజరామరం !.

- రామకృష్ణ చంద్రమౌళి



పాటనై వస్తున్నానంటూ
జనం గుండె చప్పుడుగా
గజ్జెకట్టి దరువేసిన చైతన్యం
పొడుస్తున్న పొద్దుతో పోటీ పడుతూ
ఉద్యమాలకు ఊపిరూది
ప్రజా పోరాటాలకు అండగా
కొండంత ధైర్యంగా నిలిచిన సంచలనం.
తూఫ్రాన్ లో పుట్టిన పాటల తుఫాను
కన్నవారి నుండి పుణికిపుచ్చుకున్న
పాటకు ప్రాణం పోస్తూ..
జానపదాల జీవాక్షరాలతో
జనసంద్రానికి
దగ్గరైన బుర్రకథ విఠల్
విప్లవాన్ని కదిలించేందుకు
సాహిత్యంతో కలిసిన ఆటపాట
జనసముద్రంలో ఎలుగెత్తి
అమ్మా తెలంగాణమా అంటూ
ఆకలి కేకల గానాన్నీ
భుజానెత్తుకొన్న ప్రజాగాయకుడు
పాట మీద పేలిన తూటా
చివరిదాకా ప్రజా యుద్ధనౌక వెంటనే
తాను జనం గుండెచప్పుడైనా
జీవితమంతా పోరాటానికి అంకితమైనా
భూతల్లిని ముద్దాడిన వేళా..
ఆ పాటగుండె మాత్రం మౌనంగా
మూగబోయిన గొంతులో
రాగమెవరు తీస్తారో అంటోంది...

- శ్రీలతరమేశ్ గోస్కుల

### నింగికెగసిన వేగుచుక్క

లక్షలాదిమందిని
తన కలంతో గళంతో
కదిలించిన ప్రజాయుద్ధనౌక
నేలకొరిగింది
ప్రజా గొంతుక
మూగబోయింది
యావత్ తెలంగాణ
శోకసంద్రంలో మునిగిపోయింది!!.
బ్యాంకు ఉద్యోగ జీవితానికి తిలోదకాలు
గజ్జ కట్టి గొంగళి భుజాన వేసుకుని
ప్రజా జీవితంతో మమేకం
ప్రజల పక్షాన నిలిచాడు
జీవితాన్ని
బడుగుల అభ్యున్నతికి ధారపోశాడు!!
పేదల కష్టాలను
పాటల రూపంలో
వేదికల మీద
ప్రళయరుద్రునిలా గద్దర్ గర్జించాడు
తూటాలకు ఎదురొడ్డి
తుది శ్వాస వరకు
బుల్లెట్లతోనే కాపురం చేశాడు
అతని దేహమంతా గాయాలు
తాకితే
ఎన్నో వేల గేయాలు!!.
పాట విలపిస్తోంది
పల్లవి వెలవెలపోతుంది
జన సంద్రమైన నగరం
జన నీరాజనం
నీ పాటకు లేదు మరణం
భూమి ఉన్నంతకాలం
నీ పాట సజీవం
ప్రజాపోరాటాలు
ఉన్నంతకాలం
పాట ఉన్నంత వరకు
నీకు లేదు మరణం
నీ పేరు అజరామరం.

- పరిమి వెంకట సత్యమూర్తి

### చెరగని సంతకం

పొడుస్తున్న పొద్దుమీద
చెరగని సంతకం గద్దర్
భుజంపై గొంగడి
కాళ్లకు గజ్జెలతో
తనదైన శైలిలో
ఆటపాటలతో
ప్రజాసమస్యలపై నిగ్గదీస్తూ
జీవితాంతం కొట్లాడిన ప్రజాయుద్ధనౌక
జననాట్యమండలి ఏర్పాటులో
ముఖ్యపాత్ర
తనతల్లి కష్టం యాదిచేసుకుంటూ
సిరిమల్లె చెట్టుకింద లచ్చుమమ్మ పాట
దళిత నేపథ్యమూ
సమాజ అసమానతలూ
బాంక్ ఉద్యోగానికి
రాజీనామా చేయించాయి
రాసిన వేల పాటల్లో
ఏ పాటనూ పక్కన పెట్టలేని సాహిత్యం
ప్రకృతి ప్రేమికుడుగా తన సంతానానికి
సూర్యుడు.. చంద్రుడు.. వెన్నెల పేర్లు
బుద్ధ భోదనల స్ఫూర్తితో
తాను ప్రారంభించిన పాఠశాలకు
'మహాభోధి'గా నామకరణం
ఎన్ని అవకాశాలొచ్చినా
కమర్షియల్ సినిమాలకు
సాహిత్యాన్ని
కంఠాన్ని
అందించేందుకు నిరాకరణ
చెల్లెలి పాదం మీద పుట్టుమచ్చపై
ప్రభుత్వ నంది పురస్కారం
స్వీకరించని స్థిరచిత్తం
గద్దర్ అంటే తెలంగాణ పోరాట స్ఫూర్తి
ఊహించని అమరత్వం
జీర్ణించుకోలేం చాలాకాలం
ఆయన ఆశయం సమసమాజం
నిండాలి ఆ నినాదం మన ప్రతి మదిలో.

-అరుణ జ్యోతి

### పొడుస్తున్న పొద్దువే...

ఓ గద్దరన్నా!
వికీపీడియాలో ఒక్క పేజీవి కావు
తూప్రాన్లో పుట్టిన తుఫానువి
పీడిత ప్రజల గుండెల్లో ధైర్యానివి
ఉద్యమవే ఊపిరిగా బతికిన
విప్లవకారుడివి
ఉద్యమ పార్టీ పేరునే
నీ పేరుగా మార్చుకొన్న ఉప్పెనవి
తెలంగాణాకు గానాలను అరువిచ్చిన
అపర సాహిత్య కుబేరుడివి
ఉస్మానియా విశ్వవిద్యాలయ తల్లి
ముద్దు బిడ్డవి
బుర్రకథలతో
బూజుపట్టిన బుర్రలను
రిపేరు చేసిన ఇంజనీరువి
రౌద్ర రసాలను రచించిన రచయితవి
నంది అవార్డుని తుస్కారమన్న
తిరస్కారానివి
పుట్టుకతోనే పుట్టిన సహజ నటుడివి
అకృత్యాలపై
తాండవం చేసిన
జననాట్య మండలి నటరాజువి
తుపాకి గుండుని
గుండెల్లో దాచుకొన్న దేశభక్తుడివి
నీ మాటల తూటాలతో
అస్పృశ్యతలను కాల్చేసిన
మర తుపాకివి
పాటల పదాలతో
అన్యాయాలను ఎలుగెత్తి ప్రశించిన
మాగొంతుకవి
గజ్జెల చప్పుళ్ళతో
ప్రజా పీడితుల గుండెల్లో
దడపుట్టించిన పూరించిన శంఖానివి
తెలంగాణా చెట్టుకి అల్లుకొన్న
మల్లెపూల పందిరివి
చివరికి మహాభోదికి చేరిన బుద్ధుడివే
అర్థాంతరంగా అంతర్థానమైపోయిన
ప్రజా యుద్ధ నౌకవి
ఆగస్టు ఆరున అపోలోలో ఆగింది
నీ గుండె మాత్రమే
నీ ఆశయం మాత్రం
అనంతకాలం బతికే ఉంటుంది
మరణం కేవలం నీ కాయానికే
నీ రణం మాత్రం సుదీర్ఘ కాలం
మాటను, పాటను ఇచ్చిన
నీ గొంతు మూగబోయినా,
మా లక్షల, కోట్ల గొంతుకలు
ఎలుగెత్తి అరుస్తూనే ఉంటాయి
నీ ఆశలు,
ఆశయాలు మా రూపంలో
బండెనక బండి కట్టి
వెళుతూనే ఉంటాయి
మా జ్ఞాపకాలలో నీవు
ప్రతిరోజూ పొడుస్తున్న పొద్దువే!.

- నాగరాజు చుండూరి



### ప్రజాగర్జన

స్వాతంత్రానికి ముందే
బ్రిటిష్ వారికి ఎదురొడ్డిన
గదర్ పార్టీ పేరుమీదే వచ్చిన పాట
ప్రజలకు బాసట
ప్రజా యుద్ధకర్త.
తిరుగుబాటు తన ధోరణని
స్వేచ్ఛే తన ఆయుధమని
తనదే ఒక బాణీయని
తనదైన ఒక శైలిలో
తనదంటూ ఒక వేష భూషణతో
పటిష్టమైన భావాల
ఖార్కానా పద్ధతి.
నడచిన పరిశ్రమ ప్రజలకై
తన జీవితాన్ని ఫణంగా పెట్టి
మాటలో పాట ఉన్నదని
పాటలో లయ ఉన్నదని.
పద, సంగీత, లయ గజ్జల
విన్యాసంతో
సగటు మనిషి
మనస్సుని ఆకట్టుకున్నావులే
వారికై జీవితం అంకితం
ఆ ఘనత నీదే గద్దర్!
దిక్కులన్నీ పిక్కటిల్లేలా అదరగా
అరచి
పాడి
ఆవేశపూరితంగా
ప్రతి హృదయపు అంచులు తాకగా
స్వేచ్ఛ ప్రాముఖ్యతను
తనివి తీర నేర్పిన ఓ గద్దరా
ప్రళయ విజృంభణమా
ప్రజా గళ సంకేతమా
ప్రజల బాధల ప్రతిరూపమా
దాచుకోకుమా మా ప్రాణమా!.

-కె.కె.తాయారు

### గర్జించిన సింహం

పీడిత తాడిత వర్గాల కోసం
పోరాడిన తెలంగాణ చైతన్య గీతిక
కోటి రతనాల వీణగా పేరొందిన
తెలగాణ కోటి ప్రజల గొంతుక
ఎన్నెన్నో అవమానాల పుట్టుక
గళమెత్తి గర్జించిన యుద్ధనౌక.
బండెనక బండి కట్టిన
విప్లవ కర్షకుడు
పొడుస్తున్న పొద్దుపై
పయనించిన సూర్యుడు
మల్లె తీగకు ప్రేమగా
అల్లుకుపోయిన పందిరతడు
చెల్లి పాదం మీద పుట్టుమచ్చగా
మిగిలిన లోకమాన్యుడు
మన లోగిలి సోదరీమణుల
గుండె గుడిలో వెలిగి పోతున్న
ఉదారుడు.
ఒంటి పైన చొక్కాలేక
భుజాలపై వేలాడే తెల్లజుట్టిక
గొంగడి కండువాగా
గోచీ, ధోవతితో
విప్లవానికి నిలువెత్తు రూపమిక
దగా కోరుల గుండెల్లో
దడ పుట్టించిన ధైర్యమిక
జనం కోసం దరువేసిన చైతన్య గీతిక
కనుమూసి తెరచినంతలో
కనుమరుగై పోయిన ధైర్యవీచిక
గర్జించిన సింహమది
గగనానికి తరలింది నేడది...!.

-పురం మంగ

### గతించదేనాడూ

కదం తొక్కిన గళం
చెదరని బెదరని స్వరం
సమాజ పరివర్తన ప్రభంజనం
పాటల పల్లవుల విప్లవం
ఏదీ? ఎక్కడ?
భుజం మీది గొంగళి దులిపి
భువినొదిలిన గద్దర్
కలం వదిలినా
కలకాలం సజీవం
ఇది ఖరారు.

-ఉండవిల్లి సుజాతామూర్తి

### గద్దరన్నా...

పీడిత పాటల దప్పుల దరువుల్లో...
నీ గుండె సప్పుడుల
ఢమరుక ఉరుములు..
తాడిత బాధల గజ్జెల దారిలో
నీ గొంతుల నడచిన
ఈటల నడకలు. .
తూటాలను పాటలతో పడకొట్టి
పాలకులకు హడలెత్తే తొడకొట్టి
అలసిపోని పాటవై
ఆగిపోయినవా!
కన్నీటి గాథలు
అణగారిన ఆర్తనాదాలు
అంత మొందే దాకా
పాటవై మల్లా వస్తవన్నా!.

- నోముల చక్రపాణి

## గృహలక్ష్మి పథకం నిరంతర ప్రక్రియ: విప్ బాల్క సుమన్

ఆదిలాబాద్, ఆగష్టు 9: తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా చేపట్టిన గృహలక్ష్మి పథకం నిరంతరం కొనసాగుతుందని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ బుధవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఇండ్లులేని నిరుపేదల కోసం ఖాళీ స్థలం, ఇల్లు నిర్మించుకోవాలనే సదుద్దేశంతో రూ.3లక్షలు అందించే విధంగా పథకాన్ని ప్రవేశపెట్టారని గుర్తు చేశారు.

కేవలం రాజకీయ లబ్ది పొందేందుకు విపక్షాలు పథకంపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలు విపక్షాలు చేసే విష ప్రచారాలు నమ్మవద్దని కోరారు. గృహలక్ష్మి పథకం నిరంతరం కొనసాగుతుందని అర్హులైన నిరుపేదలు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు సమయం ముగిసిందనే అసత్య ప్రచారాలను నమ్మకుండా మీ ప్రాంత ప్రజా ప్రతినిధుల సహకారంతో జిల్లా కలెక్టర్ కు మీ దరఖాస్తులను అందజేయాలని కోరారు.

## పంచాయతీ కార్మికుల సమ్మె విరమణ

హైదరాబాద్, ఆగష్టు 9: తమ సర్వీస్ లను క్రమబద్ధీకరించాలని కోరుతూ గత 34 రోజులుగా సమ్మె చేసిన పంచాయతీ కార్మికులు బుధవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్దకు చేరుకుని, తాము తాత్కాలికంగా సమ్మెను విరమిస్తున్నామని వెల్లడించారు. జిల్లా అదనపు కలెక్టర్ విజయేంద్ర రెడ్డి ని కలిసి సమ్మె విరమణ పత్రాన్ని అందజేశారు. ఇందులో పంచాయతీ కార్మికుల జెఎసి జిల్లా నాయకులు జయచెందర్, శ్రీనివాస్ తదితరులున్నారు.





### బండికల్లు వెంకటేశ్వర్లు ఫౌండేషన్ వారి

సామాజిక, సాహిత్య కార్యక్రమాలలో భాగంగా

ఈ ఏడాది 'విశాఖ సంస్కృతి' 'తెలుగు మాసపత్రిక మీడియా సౌజన్యంతో నిర్వహిస్తున్న

"జాతీయ స్థాయి కథల పోటీ"కి కథలను ఆహ్వానిస్తున్నాము

**నియమ నిబంధనలు :**

1) కథల నిడివి చేతిరాతలో ౦4 సైజు పేపర్లు 5 పేజీలు, డి.టి.పి లో అయితే ౦4 సైజు 4 పేజీలకు మించరాదు.

2) రచనపై రచయిత పేరు, చిరునామా, సెల్ నెంబరు ఉండరాదు. కేవలం "హామీ పత్రం" లోనే రచయిత వివరాలు వ్రాయాలి.

3) కథల్లో కుటుంబ వ్యవస్థ, నైతికవిలువలు, సామాజిక అంశాలు ప్రతిబింబించాలి.

4) న్యాయ నిర్ణేతలు ఎంపిక చేసిన 6 కథలకు ఒక్కో కథకు రు. 2,000/-చొప్పున నగదు బహుమతి వుంటుంది.

5) బహుమతి పొందిన కథలు 'విశాఖ సంస్కృతి' వ మా స ప త్రి క లో ప్రచురితమౌతాయి.

6) కథలు చేరవలసిన ఆఖరు తేదీ : **24-08-2023**

కథలు పంపాల్సిన చిరునామా : **బండికల్లు జమదగ్ని**, అధ్యక్షులు, ఒడికల్లు వెంకటేశ్వర్లు ఫౌండేషన్402, హిమజ టవర్స్, 3/10 బ్రాడీపేట, గుంటూరు - 522002. సెల్ నెం. 9848264742




సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న

## 'బుధవారం బాద్షా' పోటీ ఫలితాలు

అడ్మిన్: రమాదేవి కులకర్ణి 8985613123



నిర్వహణ: శ్రీమతి సత్య నీలిమ

(ప్రథమ)

### మైత్రీ బంధం

గాలి వీస్తే ఆరి పోవు దీపం
రోజు గడిస్తే రాలి పోవు పుష్పం
మెలకువతో చెదిరి పోవు స్వప్నం
ప్రళయమొచ్చినా చెదరనిది స్నేహం.
మెలకువ వరకే కలల పయనం
తీరం వరకే అలల పయనం
పరిణయం వరకే ప్రేమ పయనం
మరణం వరకు కొనసాగు మైత్రీ బంధం.
ఏ దేవి వరమో, నీ చెలిమి నేస్తం
ఏ పూజ ఫలమో, ఈ స్నేహ బంధం
ఒంటరితనంలో నను పలకరించే పదం
నీ పలుకే కష్టకాలాన, కొండంత బలం
వెన్నంటి నిలిచావు నా నీడవై ఓ నేస్తమా
ఎన్నడూ వీడని నా తోడువై ఓ నేస్తమా.
స్వార్థం, కపటం ఎరుగదు మన స్నేహం
మన స్నేహ బంధం చేసె
ఒత్తిడిని దూరం
మన స్నేహ బంధం నింపె
ఆత్మ విశ్వాసం
మన స్నేహ బంధం పంచె
అనురాగం.
నా మౌనం వెనుక దాగిన మాటను
నా కోపం వెనుక నక్కిన ప్రేమను
నా నవ్వు మాటున ఒదిగిన బాధను
అర్థం చేసుకునేది నువ్వే ఓ నేస్తమా
అడగక దొరికిన వరమే
ఈ స్నేహ బంధం



-జె వి కుమార్ చేపూరి

(ద్వితీయ)

### ఓ నేస్తమా

కలతగా ఉన్నప్పుడు
కన్నీటి చుక్కవై ఓదారుస్తావు!.
నలతగా ఉన్నప్పుడు మెత్తని స్పర్శవై
అక్కున చేర్చుకుంటావు!.
కష్టాల కడలిలో పయనించే
బతుకునావకు సరంగువై
భరోసా నిస్తావు!.
నష్టాల ఊబిలో
కూరుకు పోయిన జీవితాన్ని
సాయపు చేయందించి ఒడ్డుకెక్కిస్తావు!.
ఆనందపు తేరులో ఊరేగేందుకు
బోయీవై భుజానికెత్తుకొంటావు!.
కాకెంగిలి దోస్తానమా!
కలుసుకున్న ఆరోజు ఇంకా
గుండె కింద తడిగా తాకుతునే ఉంది!.
చేసిన అల్లరింకా కళ్ళముందు
నవ్వుల పువ్వులా గుబాళిస్తూ ఉంది!.
భుజాల మీద వేసుకుని నడిచిన
పాద ముద్రల అచ్చులు
మనో మైదానంలో
ఇప్పటికీ ఆకర్షిస్తూనే ఉన్నాయి!
నేస్తమా! చెలిమి అంటే
చెలిమ వంటి
కలిమిన్నది అందుకేనేమో!
స్నేహమంటే ఎండిపోని
మమతల జీవనదనీ
ఆత్మీయ పురులతో అల్లిన
బలమైన బంధమన్నది నిజం కదా!
స్నేహబంధపు జీవితాలన్నీ చరిత్రలో
కథలై సజీవంగా నిలిచాయి!
నేస్తమా!సోపతంటే
ఆపతి రానీయని
అమృత హృదయ భాండమని
ఆరిపోని దీపమని తెలిసింది!

-పురిమళ్ల సునంద
ఖమ్మం

Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.